www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 నవంబర్ 2023
5
తూర్పుగోదావరి

డిసెంబర్ 6న అంబానీ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ ధీరూభాయి అంబానీ క్విజ్ పోటీలను ఈ ఏడాది డిసెంబర్ 6న నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాజమహేంద్రవరం నగరంలోని వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో క్విజ్ పోటీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల నుంచి రెండు టీమ్లుగా 4గురు విద్యార్థులను పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పేరు నమోదు మరియు ఇతర వివరాలు కొరకు సెల్ నెం. 9959988835, 6302223156 సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

▸ లేకుంటే డిసెంబర్ 8 నుంచి సమ్మె తప్పదు ▸ రిలే నిరహార దీక్షలు, ధర్నాల్లో నాయకులు హెచ్చరిక

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రాల వద్ద శనివారం ధర్నాలు, సామూహిక రిలే నిరాహారదీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ ఏడాది డిసెంబర్ 8 నుంచి సమ్మెలోకి వెళ్లక తప్పదని హెచ్చరించారు. **రాజమహేంద్రవరం** నగరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు సెంటర్ వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ పాల్గొని అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే అదనంగా అంగన్‌వాడీల వేతనం చెల్లిస్తానన్న జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చెల్లించాలని, 2017 నుంచి బకాయి పెట్టిన టిఎ బిల్లులు చెల్లించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 8వ తేదీ నుంచి అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఏపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు శారద, సునీత మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా వేలాది అంగన్వాడీ సెంటర్లను మెర్జ్ చేశారని, నూతన విద్యా విధానం పేరుతో ఉన్న సెంటర్లను సైతం పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల పిల్లలకు పౌష్టికాహారం దూరమవుతుందని విమర్శించారు. బాలింతలకు ఇంటికి వెళ్లి ఫేస్ రికగ్నిషన్ చేసే యాపుల పని అంగన్‌వాడీలకు భారంగా మారిందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు నాయకులు రామలక్ష్మి, మరియమ్మ, శేషా రత్నం, స్రవంతి, నగరాని, హేమలత, తదితరులు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు, ఆయాలు సామూహిక రిలే నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ మాణిక్యాంబ, జిల్లా కార్యదర్శి వై.బేబీరాణి డిమాండ్ చేశారు. దేశంలో పిల్లలకు పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య, గర్భిణీ స్త్రీల రక్షణ, బాలింతలు ఆరోగ్యానికి ఐసిడిఎస్ పథకం అద్భుతమైన మేలు చేస్తుందని అన్నారు. ఐసిడిఎస్ ఏర్పడిన తర్వాత మాతృ మరణాలు, శిశుమరణాలు తగ్గించడంలో విశేష కృషి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ ద్వారా జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే డిసెంబర్ 8 నుంచి సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.బ్రమ్మమ్మ, వి.శ్రీదేవి, శాంతకుమారి, పుష్ప, సుశీల, బావజాని, భాగ్యం, సుజాత, దమయంతి, మహాలక్ష్మి, విజయకుమారి తదితరులు నాయకత్వం వహించారు. **పెరవలి** స్థానిక పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ప్రాజెక్టు పరిధిలో ఉన్న మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సూర్యకాంతం యూనియన్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు వేతనంతో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

రాజమహేంద్రవరంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ

నాయకులు కె. రత్నకుమారి, ఎం.కన్యాకుమారి, సిహెచ్.విశాలి, ఎం.జానకి, ఎస్.రంగనాయకమ్మ, యు.ధనలక్ష్మి, ఎన్.వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలు టిపి.లక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి బేబీ రాణి పాల్గొని మాట్లాడారు. బడ్జెట్లో ఐసిడిఎస్‌కు నిధులు కేటాయింపు తగ్గించడం వలన పోషకాహారం అందించే విషయంలో మన దేశం వెనుకబడుతుందని, అత్యంత వెనుకబడిన దేశాల కంటే దిగజారిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాస్, ప్రాజెక్ట్ నాయకులు ఎస్.రామలక్ష్మి, టిపి.నాగలక్ష్మి, టి.రమాదేవి, పి. రాజేశ్వరి, కె.స్వర్ణలత, శివకుమారి, విమల, పద్మ రాజేశ్వరి, గంగాభవాని, వరలక్ష్మి కుమారి పాల్గొన్నారు.

కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీల సామూహిక దీక్ష

గోపాలపురంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పెరవలిలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నాలో అంగన్‌వాడీలు

కులగణనపై శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కుల గణన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమగ్ర కుల గణన ప్రక్రియను సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్‌లు కీలకమైన విధులను నిర్వర్తించాలని జెసి ఎన్.తేజ్ భరత్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో "కులగణన 2023" సర్వే పై మాస్టర్ శిక్షకులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కుల గణనలో కుటుంబ సభ్యులు ప్రాథమిక సమాచారంలో జిల్లా, మండలం, గ్రామం వివరాలు, గృహ ద్వితీయ వివరాల్లో కుటుంబ పెద్ద, ఇంటి చిరునామా, గృహ వివరాలు, ఎంతమంది తదితర అంశాలను, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటింటి సర్వే ప్రక్రియలో సచివాలయ ఉద్యోగి - వాలంటీర్ కలిసే కుల గణన చేయాలని, ఖచ్చితంగా మార్గదర్శకాలు అనుసరించాలని తెలిపారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు జిల్లాల్లో 5 గ్రామాల పరిధిలో కులగణన ప్రస్తుతం నిర్వహిస్తున్నామని రాష్ట్ర, గ్రామ వార్డు సచివాలయ సాంకేతిక పరిపాలన అధికారి రత్న కిషోర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి. నరసింహులు, చీఫ్ ప్లానింగ్ అధికారి ఏ.ముఖ లింగం, కెకె ఆర్‌సి ఎస్‌డిటి.కృష్ణ నాయక్, ఎమ్. భాను ప్రకాష్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, గణాంక అధికారులు, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.

జాయింట్ అకౌంట్ ఉత్తర్వులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి ఖాతాతో విద్యార్థికి కూడా ఉమ్మడిగా బ్యాంక్ అకౌంట్ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, వెంటనే ఉత్తర్వులను రద్దు చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాంబాబు, ఎన్.రాజా డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటనను విడుదల చేశారు. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రారంభం నుంచి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు కొత్తగా విద్యార్థిని కూడా చేర్చి జాయింట్ అకౌంట్ చేయడం వలన కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమటని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యాదీవెన పథకంలో నాలుగు దఫాలలో చివరి దఫా గత రెండు సంవత్సరాలుగా అమలు చేయలేదన్నారు. వసతి దీవెన రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. దీని వలన రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.1600 కోట్లను విద్యార్థులు నష్టపోయారని అన్నారు. కొత్తగా పెట్టిన నిభంధన పథకాల్లో కోతలు విధించేందుకే అని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. పథకాలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకుండా కోతలు విధించి నిధులు మిగిల్చుకునే కార్యక్రమం చేయడం సిగ్గుచేటన్నారు. కొత్త నిబంధన వల్ల ప్రయోజనం లేకపోగా అనేక నష్టం జరుగుతుందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ అకౌంట్ నిబంధనను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.1600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

మహేంద్ర చిత్రపటానికి నివాలర్పిస్తున్న మోషేన్ రాజు

దళిత యువకుడు మహేంద్ర
మృతి బాధాకరం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

దళిత యువకుడు బొంతా మహేంద్ర మరణం బాధాకరమని మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల వేధింపులతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన బొంతా మహేంద్ర కుటుంబ సభ్యులను ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి ప్రతిదాడి సరియైన మార్గం కాదని యువత సంయమనం పాటించాలని అన్నారు. మృతుడు మహేంద్రని తిరిగి తీసుకురాలేమని, యువకుడి మృతితో ఆవేదనతో ఉన్న కుటుంబానికి ఓదార్చడం కనీస బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహేంద్ర ఆత్మహత్యకు కారణాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ జరిపి, కారకులపై ఖఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. యువకుడి మృతి సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, గంటల వ్యవధిలోనే ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ.10 లక్షలు, వైసిపి పక్షాన మరో రూ.10 లక్షలు అందించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మెన్ కాకుమాను రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు అజ్జరపు వాసు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్‌పి జగదీష్

పోలీసు సిబ్బంది తమ సంపూర్ణ ఆరోగ్యం కొరకు, నిత్యం ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకునేందుకు, వ్యాయామం, యోగ ప్రతిరోజూ తప్పనిసరిగా చేయాలని జిల్లా ఎస్‌పి పి.జగదీష్ అన్నారు. ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో పోలీస్ వెల్ఫేర్ నిధుల నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన రెండు షటిల్ కోర్టులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం ఏదో ఒక వ్యాయామం చేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని అన్నారు. వ్యాయామం, యోగ చేయడం ద్వారా తమ మానసిక స్థితి, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవచ్చున్నారు. ఈ ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఈ సెటిల్ కోర్ట్‌లు అందుబాటులో ఉన్నందున వారి ఖాళీ సమయంలో షటిల్ ఆడుకోవచ్చునని, అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ధవలేశ్వరంలో ఉన్న యువత పోలీసు వారితో కలిసి ఈ షటిల్ గ్రౌండ్‌ను ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. అలాగే పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు ఈ షటిల్ గ్రౌండ్ వినియోగించు కోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి రామవర్మ, సౌత్ జోన్ డిఎస్‌పి ఎ.శ్రీనివాస్, సిఐ మంగాదేవి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో పాదయాత్ర

రోడ్ల దుస్థితిపై పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకుడు కుందుల, ఇతరులు

ప్రజాశక్తి - పెరవలి

టిడిపి, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం పేరుతో పాదయాత్ర జరిగింది. మండలంలోని కానూరు నుంచి ఉసులుమర్రు వరకూ టిడిపి సీనియర్ నాయకులు కుందులు వీర వెంకట సత్యనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి తులా చినబాబు ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులు, ప్రజలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుంతల ఆంధ్రప్రదేశ్‌గా పిలుస్తున్నారని, అయినా రాష్ట్ర పాలకులకు సిగ్గు అన్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాకలపూడి వెంకటరత్నం, అంబటి వెంకటరమణ, మద్దుకూరి రాధా, జనసేన నాయకులు మొహమాటి చక్రధర్, పల్లాలు, హనుమంతు, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చాగల్లు

గ్రంథాలయ వారోత్సవాలు శనివారం కొనసాగాయి. జిల్లాలోని పలు మండలాల్లోని వివిధ శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. **చాగల్లు** స్థానిక శాఖా గ్రంథాలయంలో దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీర్రాజు, కవి ఎన్.రత్నాజీ, రిటైర్డ్ ఎంపిడిఒ ఆత్కూరి రామారావు, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి కుందుల వీరభద్రరావు పాఠకులు తదితరులు పాల్గొన్నారు. **కడియం** స్థానిక శాఖా గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు, పద్య పఠనం, కథలు, భగవద్గీత శ్లోకాలపై పోటీలను గ్రంథాలయ అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, గాయత్రి, నరేష్, తదితరులు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** స్థానిక శాఖా గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వైవి.స్వామి, బి.శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణారావు, స్రవంతి, వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక గ్రంథాలయంలో రాజకీయాల్లో యువత పాత్ర, ఓటు హక్కు విలువపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథపాలకులు వెజ్జు సత్యనారాయణ మాట్లాడుతూ విజేతలకు ఈనెల 20న ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు.

చాగల్లులో దేశభక్తి గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థినీ

‘పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు’

ప్రజాశక్తి - చాగల్లు

సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందని హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. స్థానిక సచివాలయం-2 పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా ప్రజల్లో సంతోషమే కనపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట మనశ్శాంతి, వైసిపి నాయకులు జె.రామచంద్ర రావు, ఎస్.అర్జునరావు, జె.ఏడుకొండలు, జి.సురేంద్ర, సిహెచ్.మల్లేశ్వరరావు, కె.సతీష్, ఎంపిడిఒ బి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

తుంగలోకి మద్యపాన నిషేధ హామీ

ప్రజాశక్తి - గోకవరం

మద్యపానాన్ని నిషేధిస్తానని మహిళలను నమ్మించి నేడు ఆ హామీనే సిఎం జగన్ రెడ్డి తుంగలో తొక్కారని మాజీ జడ్‌పిటిసి పాలూరి బోసుబాబు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంపూర్ణ మద్యపానం అంటూ ఓట్లు వేయించుకున్న జగన్మోహన్ రెడ్డి ఆ హామీని తుంగలో తొక్కేసారని అన్నారు. సంపదను సృష్టించి సంక్షేమం అందించడం రాక చివరికి మద్యాన్ని ఆదాయవనరుగా ఎంచుకుని సామాన్య ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. సంపూర్ణ మద్యపానం అమలు చేస్తానన్న జగన్ రెడ్డి 20 సంవత్సరాల పాటు బ్యాంకులు, కంపెనీలతో మద్యం కాంట్రాక్టును కుదుర్చుకోవడం మహిళలను అవమానించడమేనని అన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత లబ్ధిదారులకు శనివారం అందజేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాకు చెందిన 7గురు బాధిత కుటుంబాలకు రూ.12.65 లక్షల చెక్కులను హెూంమంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు నేనున్నానంటూ సిఎం సహాయ నిధి నుంచి అభయహస్తం అందిస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘జగన్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి’

ప్రజాశక్తి - కడియం

దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో దళిత ద్రోహిగా మిగిలిపోయారని, దళిత ద్రోహికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు సేలం రవి పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని అన్నారు. దొమ్మేరులో దళిత యువకుడిని అకారణంగా స్టేషన్‌కు తీసుకెళ్లి అవమానపర్చడం వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆ యువకుడి ఆత్మహత్యకు వైసిపి నాయకులే కారణమైనా వైసిపిలోని దళిత నాయకులు స్పందించకపోవడం ఆవేదనను కల్గిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్‌సి సెల్ నాయకులు జల్లి కృపారావు, కాయలు సత్యనారాయణ, కనికల బుల్లియ, పల్లి ప్రసాదు, మందపల్లి రత్నరాజు, చిలుకూరి నాగేశ్వరరావు, ముత్తాబత్తుల విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - సీతానగరం

దొమ్మేరు దళిత యువకుడు బొంతా మహేంద్ర మరణానికి కారకులను తక్షణమే శిక్షించాలని జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మట్టాడి వెంకటరమణ డిమాండ్ చేశారు. మహేంద్ర స్వగృహానికి శనివారం వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లెక్సీ ధ్వంసానికి కారకులైన అసలైన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గుమ్మళ్ల దొడ్డి జడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ పి చిన్ని పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సిహెచ్.ఉషారాణి, పి.అరుణ్ కుమారి, ఆర్.నాగ గంగాభవానిలను ఘనంగా సత్కరించారు.

కార్టూ‘నిజం’

ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళా సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ నాయకురాలు గీత

సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపై జరుగుతున్న ప్రజా ఉద్యమాల్లో ఎల్‌ఐసి మహిళా ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ నాయకురాలు ఎస్‌కె.గీత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మోడల్ కాలనీలో గల ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం భవనంలో 11వ మహిళ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్షుడు గుబ్బల.రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగంలో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ప్రజా ఉద్యమాల బలోపేతానికి, మహిళా ఉద్యోగులు చురుకుగా పాల్గొనాలని కోరారు. సమాజ అవసరాలు తీర్చడం కోసం మహిళ ఉద్యోగులూ కృషి చేయాలని సూచించారు. ఎల్‌ఐసి మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకురాలు జి.సూర్యప్రభ మాట్లాడుతూ మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయరంగంలో ముందుకు రావాలన్నారు. ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు సతీష్ ప్రయాగ మాట్లాడుతూ సంఘటితంగా ఉంటేనే హక్కులను కాపాడుకుంటామన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండ రామ్ మహిళా ఉద్యోగులు చేస్తున్న సేవలను, పోరాటాలను అభినందించారు. మహిళా ఉద్యోగుల కన్వీనర్ ఆర్.శిరీష ప్రవేశపెట్టిన వార్షిక నివేదికను సభ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు కెఎస్.శ్రీదేవీ, పి.విజయదుర్గ, గాయత్రి, కవిత, సుధారాణీ, ప్రసన్న కుమారి, సంఘ నాయకులు గన్నెయ్య, విశ్వనాథ్, సుధాకర్, సుబ్బారావు, శ్రీనివాస్, ఈశ్వర్రావు, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ జక్కంపూడి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా అన్నారు. శనివారం ఇనగంటివారిపేట గ్రామంలో సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లీనిక్ల భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే ముగ్గళ్ళ గ్రామంలో 215 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో సుమారు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. మరో రూ.1000 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్లు తెలిపారు. సీతానగరం నాలుగు లైన్ల రోడ్ల పనులు, తొర్రిగడ్డ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, రఘుదేవపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోస్నా, జడ్‌పిటిసి చల్లమళ్ళ వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు కరుటూరి హరిబాబు, సురేష్ రాజు, మదన్ బాబు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సత్యం రాంపండు, మద్దాల కొండలరావు, కొండ్రపు ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్ఐపై కేసు నమోదు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రూ.10 వేలు లంచం తీసుకుంటూ సామర్లకోట ఆర్ఐ ఉప్పు దుర్గ బాలాజీ రమణ మూర్తి ఎసిబికి చిక్కడంతో ఆయనపై కేసు నమోదైంది. ఎసిబి అడిషనల్ ఎస్పి సౌజన్య తెలిపిన వివరాల ప్రకారం. సామర్లకోట మండలం పనసపాడు గ్రామానికి చెందిన అవసరాల రామలక్ష్మి జనన ధృవీకరణ పత్రం తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. అయితే ఆ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ఆర్ఐ రూ.10 వేలు లంచం అడగడంతో ఆమె ఎసిబి అధికారులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఆమె అంత సొమ్ము ఇవ్వలేనని ఫిర్యాదుదారు రామలక్ష్మి రూ.8 వేలు ఇస్తానంటు ఆర్ఐతో బేరం మాట్లాడుకుంది. ఆ క్రమంలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో సామర్లకోట మండలం మాధవపట్నం సెంటర్ వద్ద ఆర్ఐ సూచన మేరకు అతని సహాయకుడు చిన్నకు ఆ నగదును అందించింది. అనంతరం ఆ నగదును కాకినాడ గాంధీనగర్‌లోని ఒక మెడికల్ ల్యాబ్ వద్ద ఆర్ఐ దుర్గ బాలాజీకి అందించినట్లు అడిషనల్ ఎస్పి సౌజన్య చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆర్ఐని కోర్టులో హాజరుపరిచినట్లు శనివారం తెలిపారు.

పోలవరం కాలువలో మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట పోలవరం కాలువలో శనివారం మృత దేహం లభ్యమైంది. స్థానిక సిఐ లక్ష్మణ రావు తెలిపిన ప్రకారం.. జగ్గంపేటలో శెట్టి బలిజపేటకు చెందిన కొప్పు పూర్ణ చంద్ర రావు (63) అను వ్యక్తి శనివారం బహిర్భూమికి కాలువకు వెళ్ళగా ప్రమాదవశాత్తు కాలి జారీ కాలువ లో పడిపోయాడు. ఈ సంఘటనపై తమకు అందిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘరానా మోసగాడు అరెస్టు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అమాయిక మహిళలను మోసం చేస్తూ లక్షలాది రూపాయలను ఖాజేసిన ఘరానా మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదు అయిన కేసులపై విచారించి సంబంధిత నిందుతుడిని అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పి ఎం.రజిని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన షేక్ నాగూర్ మీరావలి జిల్లాలోని పలు బ్యాంకుల వద్ద ఉండి బ్యాంకుల్లో డబ్బులు కట్టటానికి వచ్చిన అమాయక మహిళలను పరిచయం చేసుకుని తాను సదరు బ్యాంకులో పని చేస్తానని నమ్మించేవాడు. బ్యాంకులో కట్టటానికి తెచ్చిన డబ్బు తీసుకుని తాను బ్యాంకులో డబ్బులు కడతానని చెప్పి కట్టకుండా వారికి దొంగ రసీదు ఇచ్చి డబ్బులను తీసుకుని వెళ్ళిపోయేవాడు. అలాగే తూర్పు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాల్లో గ్రామాలు మరియు వార్డుల్లో తిరుగుతూ అమాయక మహిళలను ఎంచుకుని వారి అమయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తాను మునిసిపాలిటీలో పనిచేస్తానని ప్రభుత్వం ఇచ్చే టిడ్కో ఇళ్ళను తక్కువ ధరకు ఇప్పిస్తానని, అందుకు కొంత నగదు అవుతుందని చెప్పి నమ్మించి వారి వద్ద డబ్బు తీసుకుని వారికి ఇళ్ళు ఇప్పించకుండా వెళ్లిపోయేవాడు. సంబంధిత వ్యక్తిపై జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఆయా కేసులపై విచారణ చేసి సదరి ముద్దాయి కదలికలపై నిఘా ఉంచి నగరంలోని కోటిపల్లి బస్టాండు వెనుక వీధిలో అరెస్టు చేసినట్లు తెలిపారు. ముద్దాయి 13 ఏళ్ల నుంచి ఈ విధమైన నేరాలను నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలో చేశాడని, ఆయా కేసుల్లో పలు దఫాలు జైలుకు వెళ్లినట్లు తెలిపారు.

బిసిలకు మంత్రిత్వ శాఖ పెట్టాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మాణించింది. రాష్ట్రంలో బిసిల స్థితిగతులు, బిసి సబ్ ప్లాన్ నిధుల మళ్లింపు, జరుగుతున్న అన్యాయంపై స్థానిక ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్లో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశానికి మండలి మాజీ ఉప సభాపతి రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ ఎంఎల్‌సి బుద్దా వెంకన్నతోపాటు టిడిపి, జనసేన, బిజెపి, కాంగ్రెస్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ బిసిలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అందరూ ఐక్యంగా ముందుకు సాగితేనే బిసిలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం బిసిలపై వేధింపులు అధికమయ్యాయని, తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. కుల గణన చాలా పారదర్శకంగా చేయాలని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, మధు, బాలేపల్లి మురళీధర్, కుడుపూడి సత్తిబాబు, రెడ్డి మణి, కొల్లివెలసి హారిక, కురగంటి సతీష్, కాలెపు సాయిరామ్, రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలాజీకి రూ.3.48 లక్షల ఆదాయం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం వివిధ సేవల ద్వారా రూ.2.37 లక్షలు ఆదాయం రాగా, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1.10 లక్షల విరాళాలు వచ్చాయని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 4,693మంది దర్శనం చేసుకోగా, 3,418 మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా మశనివారం గోగన్నమఠంలో శాంతి కళ్యాణం నిర్వహించామన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్య వేక్షించారు.

రబీ పంటలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రాపాక గ్రామంలో రబీ పంటల సాగుపై మండల వ్యవసాయ అధికారి సూర్య రమేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి మల్లిఖార్జునరావు పాల్గొని ఆర్‌బికె పరిధిలో రైతులకు రబీ సాగుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. డిఎఒ మాధవరావు, ఎఒ సూర్య రమేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేతన్, శ్రీనివాస్, హబ్ మేనేజర్ తులసి, రైతులు పాల్గొన్నారు.

ఉద్వేగం..ఉద్రిక్తం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పోలీసు బాస్‌ల తీరు మరోసారి విమర్శలకు దారితీసింది. అధికార పార్టీ అనుయాయులుగా మారారనే ఆరోపణలకు దారి తీస్తోంది. వైసిపి ఫ్లెక్సీల్లో ఫొటోలు చించారనే అభియోగంతో దొమ్మేరుకు చెందిన బొంతా మహేంద్ర అనే దళిత యువకుడిని పోలీసులు విచారించడంతో అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఉద్వేగానికి గురి చేసింది. అనంతరం జరిగిన అనేక పరిణామాలు ఉద్రిక్తత నెలకొంది. ఆత్మహత్య ఉదంతం అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ప్రయత్నించిన హోమ్ మంత్రి తానేటి వనితకు చేదు అనుభవం ఎదురైంది. యువకుని మృతికి మంత్రి నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు అడ్డుకోవడం, గంటల తరబడి కారులో వేచి చూసినా గ్రామంలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో మంత్రి వెనుతిరగడం వంటి పరిణామాలు గ్రామస్తుల ఆవేదనను అద్దంపట్టాయి. "హెూమ్ మినిస్టర్ సొంత నియోజక వర్గంలో ఇటువంటి పరిణామాలు చోటు చేసుకోవటం ఆ పార్టీలోనూ చర్చనీయాంశమైంది. అయితే పోలీసు శాఖ కేవలం ఎసిఐను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. గతంలో గోకవరం మండలం గుమ్మళ్ల దొడ్డిలో జరిగిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విదితమే. కడియం పోలీసు తీరు మరో సారి రచ్చకెక్కింది. ఓ మహిళ అదృశ్యం కేసులో వడ్డి వెంకట ప్రసాద్ అనే దళిత యువకుడిని పోలీసులు నిర్బంధం హింసకు గురి చేయడంతో తీవ్ర అనారోగ్యానికి గురై ఎట్టకేలకు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ప్రాణాలతో బయటపడిన ఇప్పటికీ సాధారణ స్థితికి చేర కోలేదు. ఇప్పటికైనా అధికార పార్టీ కనుసన్నల్ల నడుస్తున్న పోలీసు వ్యవస్థ ఆత్మ విమర్శ చేసుకోవాలని ఇటువంటి ఘటనలు తరచూ పునరావృతమైతే ప్రజాప్రతిఘటన భాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమగ్ర కులగణనకు కసరత్తు

రాష్ట్రంలో సమగ్ర కులగణనకు ప్రభుత్వం కృషి చేయాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ చేరువయ్యేందుకు నిర్ధిష్టమైన గణాంకాల అవసరం ఉందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టిన విషయం విధితమే. అయితే విధి విధానాలు వెల్లడించకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను సహజలను, సూచనలు తెలియజేయాలని నిర్ణయించిన సమావేశాల్లో కులసంఘాలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. కీలకమైన ఇటువంటి సమావేశానికి రాజకీయ పార్టీలను ఆహ్వానించకపోవటంలో పలు విమర్శలకు దారి తీస్తోంది. అధికార పార్టీ నేతలు ఎంపిక చేసిన కొద్ది మందికి మాత్రమే ఈ సమావేశాల్లో మాట్లాడే అవకాశం కల్పించారు. కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చామని యాప్ ద్వారా కులగణన చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.అయితే ఈ గణనకు సిబ్బంది ఎవరు..? వారికి శిక్షణ ఎలా అనే సందేహాలను నివృత్తి చేసి దాదాపు 9 దశాబ్దాల తర్వాత చేపట్టబోతే ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యం వ్యవహరించాల్సి ఉంది.

రబీకినీటి గండం

రబీ సాగుకు సాగునీటి గండం వెంటాడుతోంది. సుమారు 10 టిఎంసిల నీటి కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశాల్లో అధికారులే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలైన ఆరుతడి సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీ విత్తనాలు అందించేలా చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. గోదావరిలో డ్రెడ్జింగ్ నిర్వహించి రిజర్వాయర్ల సామర్థ్యం పెంచుకోటం, ఆధే విధంగా కాల్వల ఆధునీకరణ, స్లూయిజ్‌ల మరమ్మతులు వంటి కీలక పనులు గత రెండేళ్లుగా అటకెక్కాయి. ప్రభుత్వం కేవలం తూటు కాడ తొలగింపునకు మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకుంది. దీంతో ఆయకట్టు రైతులకు సైతం సాగునీటి సమస్యలు ఈ ఏడాది తలెత్తాయి. తాజా పరిణామాల నేపథ్యంలో కేవలం రూ.10 కోట్లు కావాలని ప్రభుత్వాన్ని కోరినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఈ నిధులతో రబీసాగుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే చర్యలు సాధ్యమేనా అనే సందేహం రైతులలోనూ, రైతు సంఘాలలోనూ వ్యక్తమవుతోంది.

27 నుంచి జిల్లాలో సమగ్ర కులగణన

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన-2023 కార్యక్రమాన్ని అన్ని కులాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు. శనివారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన-2023 కార్యక్రమంపై కాకినాడ జిల్లా స్థాయి అవగాహనా, సూచనల స్వీకరణ కార్యక్రమాన్ని నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంస్థ శాఖ ఇడి పి.వి.రమణమూర్తి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమగ్ర కుల గణన కార్యక్రమం ఆవశ్యకత, నిర్వహించే విధానం గురించి వివిధ కులాల, వర్గాల ప్రతినిధులను హాజరైన మేధావులు, సంక్షేమ సంఘాల నేతలకు వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

వల్లభ స్వామి ఆలయానికి రూ .4,13,912 ఆదాయం

ప్రజాశక్తి-పెద్దాపురం

తిరుపతి గ్రామంలోనిశంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.3,33,920, అన్నదాన విరాళాల ద్వారా రూ.71,592, కేశఖండన ద్వారా రూ.8,400 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ధర్మకర్తల మండలి చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు ,సిబ్బంది కష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సేవలందించారని అన్నారు.

యానాం వార్తలు

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-యానాం

స్థానిక ఎంజిజిబిహెచ్ క్రీడా మైదానంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం బాలుర అండర్ -14 ఖోఖో పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి బాలురు వచ్చి ఖోఖో పోటీల్లో తలపడ్డారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రభుత్వ హైస్కూల్ పరంపేట జట్టు ప్రథమ, రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పోటీలో గెలుపొందిన వారిని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకరరావులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ గేమ్స్ కన్వీనర్ పాలికి శివ ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాము సత్యనారాయణ,వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రపై సమీక్ష

ప్రజాశక్తి-యానాం

కేంద్ర సంక్షేమ పథకాలను ప్రచారం చేసేందుకు నవంబర్ 15న దేశవ్యాప్తంగా విక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.ఈ నేపథ్యంలో యానాంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఆర్ఎఒ మునిస్వామి స్థానిక ఆర్ఎఒ ఛాంబర్‌లో ఆయా శాఖల అధికారులకు శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. యాత్రకు సంబంధించి అధికారులు చేపట్టవలసిన ఏర్పాట్లపై వివరించారు. డిసెంబర్ మూడో వారంలో యానాంలో విక్షిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభిస్తామని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

వైసిపి విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని జిల్లా వైసిపి అధ్యక్షులు, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కోరారు. తాళ్లరేవు జెడ్‌పిటిసి సభ్యుడు దొమ్మేటి సాగర్ స్వగృహం వద్ద మండల పార్టీ అధ్యక్షులు కాదా గోవింద కుమార్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం పై చర్చించారు. మత్స్యకార దినోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్తిపాడు బిజెపి కన్వీనర్‌గా బాలుదొర

ప్రజాశక్తి-శంఖవరం

ప్రత్తిపాడు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ గా నెల్లిపూడి గ్రామానికి చెందిన గంటా బాలు దొరను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియమించారు. బాలు దొర శనివారం విలేకర్లతో మాట్లాడుతూ తను కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఆయనను అభినందించారు.

వృద్ధురాలి పట్ల ఎఎస్ఐ ఔదార్యం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నిరాదరణకు గురైన వృద్ధురాలి పట్ల ట్రాఫిక్ ఎఎస్ఐ రత్నం ఔదార్యాన్ని కనబరిచారు. శనివారం వృద్ధురాలిని చేరదీసి సొంత ఖర్చులతో పెద్దాపురం లోని వృద్ధాశ్రమంలో చేర్పిం బియ్యం, పండ్లు అందించారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

గండేపల్లి సూరంపాలెం గ్రామంలో టిడిపి, జనసేన సంయుక్తంగా జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి సూరంపాలెం బాలు, గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు కుంచే రామకృష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ టిడిపినాయకులు పాల్గొన్నారు. **కోటనందూరు** శృంగవక్షం గ్రామంలో తుని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ యనమల దివ్య, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో శనివారం మీ ఇంటికి మీ దివ్య , భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. జనసేన, టిడిపి ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కాజులూరు

ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించాలని పెద్దాపురం ఉద్యానవన శాఖ అధికారి ఎన్.సుజాత తెలిపారు. శనివారం కోలంక, దుగ్గుదురు గ్రామాలలో పెద్దాపురం ఉద్యాన శాఖ అధికారిని సుజాత ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సర్వే సిబ్బంది పర్యటించారు. కరప ఆత్మ కమిటీ మాజీ అధ్యక్షులు దంతులూరి వెంకట నరసింహరాజు కోలంక మాజీ సహకార సంఘ అధ్యక్షులు భూపతి రాజు రామచంద్ర రాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పాఠశాల పరిధిలోని ఆవాస్ ప్రాంతాల్లో వారి విద్యాభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు తయారు చేయడానికి ప్రభుత్వం ఆవాస్ ప్రాంత విద్యా,స్కూల్ డెవలప్మెంట్ ప్రణాళికలను ఏర్పాటు చేసిందని ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం సామర్లకోట మేరీ ఇమాక్యులేట్ పాఠశాలలో పాఠశాల ఆవసా ప్రణాళిక, పాఠశాల డెవలప్మెంట్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు మండల ఎంఆర్సి సిబ్బంది, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కరప

కరపలో వీధి రామాలయం వద్ద జెడ్‌పిటిసి సభ్యుడు వై.సుబ్బారావు, ఎంపిపి శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఎస్తేరు పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఉన్న విజన్ కంటి ఆసుపత్రి వారిచే కంటి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లుమ తెలిపారున. ఇతర సమాచారం కోసం ఈ ఫోన్ నెంబర్ 9133079997 సంప్రదించాలన్నారు.

48వ డివిజన్‌లో గడప గడపకూ..

ప్రజాశక్తి కాకినాడ రూరల్

ఎస్.అచ్యుతాపురం 48వ డివిజన్ ఎసచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. డివిజన్ వైసిపి ఇన్చార్జ్ పెదపాటి నాగబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడుగడుగునా కన్నబాబుకు, వారి తండ్రి డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు. జన చైతన్య నగర్, వినాయకుని గుడి వీధి, కాలువ గట్టు తదితర ఏరియాలో పర్యటించారు. కార్యక్రమంలో మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు చెల్లి దేవరాజు, స్థానిక వైసిపి నాయకులు సామనాసి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు..

ప్రకటన

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామ కాపురస్తులు లంకిలపిల్లి శ్రీనివాసు గారు ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నాకు చెల్లూరు గ్రామ కాపురస్తులు లంకిలపల్లి మహాలక్ష్మి గారు వగైరాలు నా పేరున ది. 11-07-2013 సం॥ తేదీ స్థిరాస్తిని రిజిస్ట్రారు దాన శెటిల్‌మెంటు దస్తావేజు నెం. 2096/2013 రు రీత్యా పొందియున్నాను. సదరు ఆస్తిని మా తల్లిదండ్రులు గారు ఉన్నటువంటి స్వార్జితంగా వెల్ల మహాలక్ష్మి గారి ద్వారా వుండవల్లి భీమరాజు 26-05-1955 తేదీన రామచంద్రాపురం పట్టణంలో గల సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1240/1955 గా రిజిస్ట్రరు కాబడిన క్రయ దస్తావేజు 15-11-2023వ తేదీన రామచంద్రాపురం పట్టణంలో గల జిరాక్సు షాపునకు వెళ్లుచుండగా మార్గం మధ్యలో నేను పోగొట్టుకోవడమైనది. కావున యావన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు పై తేదీన గల ఒరిజినల్ క్రయ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు తెలియజేయుదురని ఇందుమూలంగా యావన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

లంకిలపిల్లి శ్రీనివాసు
సెల్: 99083 43100

జనసేన పార్టీలో చేరిన నాయకులు

జనసేన పార్టీలో 100 మంది చేరిక

ప్రజాశక్తి-రాజోలు

జనసేన పార్టీ రాజోలు నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాపాక రమేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం వైసిపి నుంచి జనసేనలోకి భారీ చేరికలు జరిగాయి. కరువాక, చింతలమోరి, సఖినేటిపల్లి, మేడిచర్లపాలెం గ్రామాల నుంచి ఎస్‌సి, బిసి సామాజిక వర్గాల నుండి 100 మందికి పైగా జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మత్స్యకార విభాగం చైర్మన్ నర్సాపురం నియోజకవర్గం బొమ్మిడి నాయకర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.

డాక్టర్ యనమదలకు మాతృవియోగం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రముఖ వైద్య నిపుణుడు, వైసిపి వైద్య విభాగం ఉభయ గోదావరి జిల్లాల ఛైర్మన్ డాక్టర్ యనమదల మురళీకృష్ణ మాతృమూర్తి అనంత లక్ష్మి (73) శనివారం మృతి చెందారు. రామచంద్రాపురంలోని స్వగృహంలో ఆమె మరణించారు. ఆమెకు ముగ్గురు కుమారులు మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం, సూరిబాబు. ఆమె నేత్రాలను (కార్నియాలను) కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు బందం సేకరించారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు

ప్రజాశక్తి-మండపేట

డిజిటల్ విద్యావిధానంలో భాగంగా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదటి సంవత్సరం ఆనర్స్ విద్యార్థులకు శనివారం ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు, కళాశాల కంప్యూటర్ లెక్చరర్స్‌తో గూగుల్ షీట్‌లో ప్రశ్నపత్రాలు రూపకల్పనకు సంబంధించి ప్రత్యేక అవగహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు గుగూల్ షీట్స్‌లో ప్రశ్నప్రతాలను ప్రత్యేక లింక్స్ ద్వారా ఆయా విద్యార్థులకు పంపించినట్టు కళాశాల పరీక్షల విభాగం కన్వీనర్ డాక్టర్ జె.నెహ్రూ నాయక్ తెలిపారు. మిడ్ పరీక్షలను అన్‌లైన్ నిర్వహించడం అభినందనీయమని వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు పేర్కొన్నారు.

వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని అర్తమూరులో శనివారం ఎస్‌బిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 165వ హోమియో వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ విజయ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు సత్తి బుల్లి స్వామి రెడ్డితో కలిసి వారు మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం క్రమం తప్పకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల బృందం వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉద్దగిరి ఆంజనేయులు, తాడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను వైసిపి యువ నాయకులు తోట పృథ్వీరాజ్, వైసిపి రైతు విభాగం రాష్ట్ర కన్వీనర్ రెడ్డి రాజబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా టిఎంసి అనంతలక్ష్మి, తదితరులు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. డ్వాక్రా మహిళలతో పేదలకు అందుబాటు రేట్లలో మంచి ఫుడ్ అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి అన్ని చోట్లా ఈ ఆహా క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ మొండి భవాని మురళీ, టౌన్ వైసిపి కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ముక్కా సుబ్రమణ్యం, దాలయ్య, మారిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగాల సాధన

ప్రజాశక్తి -మామిడికుదురు

డిగ్రీ విద్య అభ్యసనలో ఉండగానే ఆయా నైపుణ్యాలు సొంతం చేసుకుంటే పలు ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించొచ్చునని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వెంకటేష్ అన్నారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు' సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు చక్కటి అవకాశాలు కల్పిస్తున్న రంగాల్లో బ్యాంకింగ్ ఒకటని చెప్పారు. బ్యాంక్ కొలువులు అంటే క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్ ఉద్యోగాలు మాత్రమే కాదని, మరెన్నో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. టెక్నాలజీ ఆధారిత సేవలు పెరుగుతున్నాయని.. దీనికి అనుగుణంగా బ్యాంకుల్లో ఐటీ విభాగంలో కొలువులు లభిస్తున్నాయని పేర్కొన్నారు. అకడమిక్స్ పరంగా ఎకనామిక్స్, బ్యాంకింగ్, కామర్స్, అకౌంటెన్సీ, ఫైనాన్స్ మేనేజ్మెంట్, ఆడిటింగ్ నేపథ్యం ఉంటే సంప్రదాయ బ్యాంకు కొలువులకు సరితూగుతారని వివరించారు. అవసరాలకు తగ్గట్టు శిక్షణ ఇస్తున్నాయన్నారు.

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 7599/2023-జి-1 ది.18-11-2023

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కాకినాడ నగరపాలక సంస్థ మరియు సర్పవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్లు మరియు ఏరియా డెవలప్మెంట్ ప్లాను నందు భవిష్యతులో అభివృద్ధి చేయవలసిన రోడ్లు నిమిత్తము ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలములు అవసరమై యున్నందున ఆయా వ్యక్తులు ముందుకు వచ్చి పై తెలిపిన రోడ్లు విస్తరణలో పోవుచున్న స్థలములను నగరపాలక సంస్థకి స్వాధీనపరచుటకు తద్వారా వారికీ ప్రత్యామ్నామంగా నష్టపరిహారమునకు బదులుగా Transferable Development Right Certificate (TDRC) నకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనియున్నారు.

ఇందుపై ప్రస్తుతము అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms. No. 119 MA&UD. Dept Dt. 28-03-2017 మరియు తదుపరి ఉత్తర్వులు G.O.Ms. No. 180, MA&UD, Dept, Dt. 01-10-2020 అనుసరించి రోడ్డు విస్తరణకు కావలసిన స్థలమును స్వాధీనపరుచుకుని Transferable Development Right Certificate (TDRC) జారీ చేయుటకు అవకాశము కల్పించబడింది. మరియు సదరు Transferable Development Right Certificate జారీ చేయుటకు ప్రభుత్వము వారు మెమో. నెం. 2250050/M2/2023, MA&UD, Dept. Dt. 30-10-2023, నందు TDR పరిశీలన కమిటీని నియమించియున్నారు. అందుపై సదరు కమిటీ ది. 18-11-2023వ తేదీన సమావేశమై సదరు దరఖాస్తులను సవివరముగా పరిశీలించి ఈ క్రింది తెలుపబడిన దరఖాస్తుదారులకు Transferable Development Right Certificate జారీ చేయుటకు ఆమోదించియున్నారు.

S.No.	Name of the Applicant	Location of the Site Affected	Survey Number	Extent Affected in Road Widening As per Master Plan/ Area Development Plan in Sq.m	Particulars of Road/ Land	Application date	Urban/ Rural	Remarks
1	Mulakala Hari krishna	Door No. 68-10-1/20, Vidyuth Nagar Ramanayya peta	166/19	18.42	Master Plan Road	003683 Dt. 13-10-2023	Rural	
2	M.Chaitanya Varma	Door No. 67-7-4/13, Ashok Nagar	194/4A6, 194/4A7	52.12	Master Plan Road	003753 Dt. 20-10-2023	Rural	

పైన తెలిపిన దరఖాస్తుల విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా ఈ క్రింది సంతకము దారునకు లిఖిత పూర్వకముగా తెలుపవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనరు**, కాకినాడ నగరపాలక సంస్థ

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు ఫ్యామిలీ కోర్టు, రాజమహేంద్రవరం

A.S. No. 86/2022

Between:
1. Vada Pushpalatha
2. Matta Sishank ...*Appellants*

AND

Dwarampudi Veeraraghava Reddy, S/o. Konda Reddy, aged 31 years, Hindu, Business, G.Mamidada Village, Pedapudi Mandal, Presently Residing at D.No. 19-11-5/1, Muchimilli Road, Ramachandrapuram, East Godavari District.

...*Respondents*

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 20-11-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బి.ఎస్.శ్రీనివాస్
శృతి.బి
రాజమండ్రి 17-11-23 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 3వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: రాజమహేంద్రవరం

O.S.No. 171/2022

Between:
Pandiri Nagalingeswara Rao ...*Plaintiff*

AND

1) Arepu Karuna Priya, W/o. Late Rajendra Prasad, Hindu, Aged 50 Years, House Wife, D.No. 8-23-9, Putchalavari Street, Vulithota Vari Veedhi, Rajamahendravaram.
2) Arepu Sunil Datta, S/o. Late Rajendra Prasad, Hindu, Aged 25 Years, D.No. 8-23-9, Putchalavari Street, Vulithota Vari Veedhi, Rajamahendravaram.
3) Arepu Phani Datta, S/o. Late Rajendra Prasad, Hindu, Aged 23 Years, D.No. 8-23-9, Putchalavari Street, Vulithota Vari Veedhi, Rajamahendravaram.

...***Defendants***

పై నెంబరు దావాలో 1,2,3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **ది.20-11-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళి మోహన్
జి.వి.రామలక్ష్మి
రాజమండ్రి, 01-11-23. అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P. 1/2013, O.S. 24/2010

Between:
నల్లా సురేష్‌కుమార్ ...*DHR*

AND

యాళ్ళ నాగ సత్య జనార్దనస్వామి ...*JDR*

To:
యాళ్ళ నాగ సత్య జనార్దనస్వామి, S/o. నారాయణమూర్తి, గారపాటి వీధి, గీతా విద్యాలయ స్కూల్ ఎదుట, అమలాపురం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

దావా డిక్రీ బాకీ నిమిత్తం జె.డి.ఆర్. తాలూకు పిటీషన్ షెడ్యూల్ ఆస్తి వేలం వేయించి వసూలు యిప్పించవలసిందిగా పై నెంబరు ప్రకారం E.P. దాఖలు చేసియున్నారు. సదరు పిటీషను వాయిదా ది. 20-11-2023వ తేదీకి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా **ది. 20-11-2023వ తేదీకి పై జె.డి.ఆర్. ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన వారి కోర్టులో హాజరు అయి ఆక్షేపణలున్న ఎడల తెలియపరచుకోవలెను.

డి. హెచ్.ఆర్. తరపు న్యాయవాది

శ్రీ నల్లా ప్రభాకర్
అమలాపురం 17-11-2023 అడ్వకేట్, అమలాపురం సెల్: 9491190659

మహారాజశ్రీ ఎడిషనల్ జుడీషియల్ Ist Class మేజిస్ట్రేట్, తాడేపల్లిగూడెం వారి కోర్టులో

O.S. 413/2022

Between:
పుట్ట ప్రభాకర్ -*ప్లెయింటిఫ్*

AND

పాతూరి వెంకట శ్రీనివాసరావు -*డిఫెండెంట్*

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాది అయిన పాతూరి వెంకట శ్రీనివాసరావు, S/o. రామారావు, హిందు, పురుషుడు, వయస్సు 33 సం॥లు, Cultivation, కలటూరు గ్రామము, ద్రాక్షారామం మండలం, తూ॥గో॥జిల్లా నివాసి అయిన మీరు శ్రీ కోర్టు వారు ఎన్నిమార్లు సమన్లను పంపినను మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. కావున సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా మీకు సమన్లను జారీ చేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు యిచ్చియున్నారు. సదరు దావా గ్రంధము **ది. 21-12-2023వ తేదీ నాటికి వాయిదా అయి ఉన్నది.** కావున మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి తమ ఆక్షేపణలను కోర్టు వారికి తెలియపరచుకొనవలెను. అట్లు చేయనిచో తమ పరోక్షముగా పై కేసును తీర్మానించునని యిందు మూలముగా తెలియజేయుచున్నాను.

Sk.Md.భాషా
తాడేపల్లిగూడెం 17-11-2023 అడ్వకేట్, తాడేపల్లిగూడెం